సాక్షి ఖమ్మం

బుధవారం । 5 । జూలై । 2023



కొరవడుతున్న పర్యవేక్షణ

జిల్లాలోని ఎస్సీ వసతిగృహాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 8లో



మురుగు.. ఇక మెరుగు!

మురుగునీరు జలాశయాల్లో కలవకుండా శుద్ధి చేసేందుకు ఉమ్మడి జిల్లాలో 19 ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 24°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రవేశాల నిబంధనల సవరణతో మేలు

- సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పువ్వాడ



ఖమ్మంమయూరిసెంటర్: వైద్య విద్య చదవాలనుకునే తెలంగాణ విద్యార్థులకు మేలు జరిగేలా తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌ను ప్రభుత్వం సవరించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వులను ఆయన ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. ఈ మార్పుతో 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలో 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయని తెలిపారు. అంతకు ముందు 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా సీట్ల కోసం ఏపీ విద్యార్థులు పోటీ పడేవారని చెప్పారు. ప్రభుత్వం తాజాగా జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటుచేస్తుండడమే కాక ప్రవేశాల నిబంధనలు సవరించడంతో తెలంగాణ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు దక్కుతాయని మంత్రి పువ్వాడ వెల్లడించారు. ఈమేరకు విద్యార్థుల కలలు నిజం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల తరఫున మంత్రి పువ్వాడ కృతజ్ఞతలు తెలిపారు.

డయల్ 100కు 4,280 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుని సత్వరమే పరిష్కరించేందుకు ఏర్పాటైన డయల్ 100కు జూన్ నెలలో 4,280 ఫోన్లు వచ్చాయి. ఇందులో 115 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఓ ప్రకటనలో తెలిపారు. అయితే, కొందరికి అవగాహన లేకపోవడంతో తప్పుడు కాల్స్ చేస్తున్నారని, అలా కాకుండా అత్యవసర పరిస్థితుల్లోనే డయల్ 100ను వినియోగించుకోవాలని సీపీ సూచించారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: కొణిజర్ల మండలం తనికెళ్లలోని లక్ష్య కాలేజీలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఫిజికల్ సైన్స్(ఎంపీసీ, ఎంపీసీఎస్, డేటా సైన్స్), లైఫ్ సైన్స్(బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్), బీకాం(సీఏ), బీకాం(జనరల్), బీఏ(సీబీసీఎస్) కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల కింద ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఏఆర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన నర్సయ్య



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ, సీఐ

ఖమ్మంక్రైం: మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ ఏఆర్ ఏసీపీగా పదోన్నతి పొందిన నర్సయ్య ఖమ్మం జిల్లాలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, ఖమ్మం క్లూస్ టీమ్ సీఐగా బి.నరేష్ కూడా విధుల్లో చేరారు. ఆయన గతంలో ఇక్కడే విధులు నిర్వర్తించగా పదోన్నతిపై హైదరాబాద్‌కు కేటాయించారు. మళ్లీ ఉన్నతాధికారులు ఖమ్మం క్లూస్ టీమ్ సీఐగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఏసీపీ, సీఐలు సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు న్యాక్ బృందం

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం బుధ, గురువారాల్లో సందర్శించనుంది. మహారాష్ట్రలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వసంత హెలవీరెడ్డి చైర్‌పర్సన్‌గా ఉన్న ఈ బృందంలో అస్సాం విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ నిరంజన్‌రాయ్, తమిళనాడులోని హాజీకురాధ రౌదర్ హౌడియా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హౌద్ మొహిద్దీన్ సభ్యులుగా ఉంటారు. ఈమేరకు కళాశాలల్లో బోధన, వసతులు, పరిశోధనా అంశాలను పరిశీలించడమే కాక పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, తల్లిదండ్రులతో ఈ బృందం సమావేశమవుతుంది. ఈ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా కళాశాలకు న్యాక్ గ్రేడ్‌ను ప్రకటిస్తారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు.

మాటల తూటాలు!

విమర్శల దాడి పెంచిన బీఆర్ఎస్, కాంగ్రెస్

- సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పదునెక్కిన వాగ్బాణాలు
- జనగర్జన సభతో వేడెక్కిన ఖమ్మం రాజకీయాలు
- ఎవరికి వారే పైచేయి సాధించేలా వ్యూహ ప్రతివ్యూహాలు



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయం రసకందాయంలో పడింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు మాటల యుద్ధానికి తెరలేపారు. ఒకరిపై ఇంకొకరు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా.. ఏ అవకాశాన్ని వదులుకోకుండా పైచేయి సాధించేలా నేతలు మాటల దాడి పెంచారు. ఈనెల 2న రాహుల్‌గాంధీ పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ జనగర్జన సభ అనంతరం జిల్లాలో రాజకీయ వేడి మరింతగా రాజుకుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

సత్తా చాటేలా బీఆర్ఎస్ సభ

ఉమ్మడి జిల్లాపై దృష్టి కేంద్రీకరించిన బీఆర్ఎస్ అధినాయకత్వం ఆ పార్టీ ఆవిర్భావ సభకు ఖమ్మంను వేదికగా ఎంచుకుంది. బీఆర్ఎస్ ఆవిర్భావ సభ హైదరాబాద్ లేదా ఢిల్లీలో నిర్వహిస్తారని తొలుత ప్రచారం జరిగినా అనూహ్యంగా సీఎం కేసీఆర్ ముగ్గురు సీఎంలు, ఒక మాజీ సీఎంను ఆహ్వానించి ఖమ్మంలో సభ నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 18న జరిగిన సభ విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది సీట్లు సాధిస్తామనే ధీమా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

పొంగులేటి తిరుగుబావుటా

ఈ ఏడాది జనవరి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో మార్పులు మొదలయ్యాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్‌పై ధిక్కార స్వరం వినిపించడంతో రాజకీయాలు వేడెక్కాయి. ఈసారి పొంగులేటి వర్గం, బీఆర్ఎస్ మధ్య విమర్శల జోరు పెరిగింది. పొంగులేటి ఏకంగా బీఆర్ఎస్ అధినేతపైనే విమర్శలను సంధించగా.. బీఆర్ఎస్ నేతలు కూడా దీటుగానే స్పందించారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసిన పొంగులేటి బీఆర్ఎస్‌పై విమర్శల పరంపర కొనసాగించగా ఇంకా విమర్శల జడివాన కొనసాగుతూనే ఉంది.

జనగర్జనతో తారాస్థాయికి..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 2న ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ జనగర్జన సభ నుంచి విమర్శలు, ప్రతివిమర్శలు మరింత పెరిగాయి. సభకు ముందు జనాన్ని అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నేతలను పొంగులేటి విమర్శించగా.. ఆ పార్టీ నేతలు ప్రతిగా స్పందించారు. ఇక సభలో రాహుల్‌గాంధీ బీఆర్ఎస్, బీజేపీపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య తదితరులు రాహుల్‌గాంధీ తీరును ఎండగట్టగా.. ఢిల్లీలో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఇతర ఎంపీలు, ఖమ్మంలో ఎమ్మెల్సీ తాతా మధు ఇదే రీతిన స్పందించారు. ఈ విమర్శలపై హైదరాబాద్‌లో టీపీసీసీ స్థాయిలో స్పందించగా.. ఖమ్మంలో కాంగ్రెస్‌నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మళ్లీ సమావేశం ఏర్పాటుచేసి బీఆర్ఎస్ నేతలు జనాలను అడ్డుకున్నా సభకు తరలివచ్చారని వెల్లడించారు. ఇక మంగళవారం కూడా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఖమ్మంలో బీఆర్ఎస్‌పై విమర్శలు సంధించారు. ఇలా సభ ముగిసిన నాటి నుంచి రెండు పార్టీల నేతలు ఘాటైన విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటూనే... రానున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహప్రతివ్యూహాలను సిద్ధం చేసుకుంటుండడంతో ఉమ్మడి జిల్లాలో ముందుగానే ఎన్నికల వాతావరణం నెలకొంది.

పోటా పోటీ..

ఉమ్మడి జిల్లాలో బలమైన పార్టీలుగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తా చాటి పది స్థానాల్లో ఆరింటిని కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ ఒక్క స్థానానికే పరిమితమైంది. దీంతో రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలను గెలుపొంది రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ఉన్న బీఆర్ఎస్ అధినాయకత్వం.. జిల్లాలో ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించినా కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు, పాలేరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు పనిచేస్తున్నారు.

ఆదివాసీలతోనే అడవికి మనుగడ



మహిళా రైతుకు పట్టా అందచేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, పక్కన ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, డీఎఫ్ఓ సిద్ధార్థ్ తదితరులు

- కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య
- సత్తుపల్లి, వీఎం బంజర్‌లో పోడు రైతులకు పట్టాల పంపిణీ

సత్తుపల్లి/పెనుబల్లి: ఆదివాసీలు ఉన్న చోటే అడవి ఉంటుందని.. చెట్టు, అడవిని దైవంగా భావించే ఆదివాసీలకు పోడు పట్టాలతో భూమిపై సర్వహక్కులు అందుతాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. సత్తుపల్లితో పాటు పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆయన పోడు రైతులకు హక్కు పట్టాలు అందజేశారు. ఈమేరకు సత్తుపల్లిలో 1,649 ఎకరాలకు 1,196 మంది గిరిజనులకు, వీఎంబంజర్‌లో 1,427 ఎకరాకు గాను 801 మంది పోడు రైతులకు పట్టాలు అందజేశాక కలెక్టర్ మాట్లాడారు. భద్రాచలం ఐటీడీఏ పీఓగా ఉన్న సమయాన అత్యధిక దరఖాస్తులు పోడు భూములకు పట్టాల కోసమే వచ్చేవని గుర్తు చేసుకున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లకుండానే పట్టాలు జారీ చేయటం వల్ల గిరిజనులు ఇబ్బంది పడ్డారని, ఈసారి అలాజరగకుండా గ్రామ స్థాయి కమిటీలతో పరిశీలించాకే పట్టాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టా పొందిన భూమిలోనే సాగు చేసుకోవాలని, కొత్తగా పోడు నరకవద్దని సూచించారు.

గిరిజన బంధువు కేసీఆర్ : ఎమ్మెల్యే సండ్ర

గిరిజనులకు సీఎం కేసీఆర్ పోడు హక్కు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వటం గొప్ప నిర్ణయమని.. ఆయన చరిత్రలో గిరిజన బంధువుగా నిలిచిపోతారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పట్టాలు అందుకున్న రైతులకు రైతుబంధు, రైతుబీమా అందనుండగా త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. కాగా, వీఎం బంజర్‌లో రైతులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు సహపంక్తి భోజనాలుచేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీలు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జెడ్పీటీసీలు కూసంపూడి రామారావు, చెక్కిలాల మోహన్‌రావు, తహసీల్దార్ రమాదేవితో పాటు కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, కనగాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ ప్రాథమిక సర్వే పూర్తి

- డోర్నకల్ – మిర్యాలగూడ లైన్‌కు త్వరలో తుదిసర్వే
- విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు
- జిల్లాలోని మూడు మండలాల మీదుగా వెళ్లనున్న లైన్



రైల్వే లైన్ కోసం కోనాయిగూడెం వద్ద సర్వే చేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీ సిబ్బంది (ఫైల్)

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మం రూరల్/నేలకొండపల్లి: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని డోర్నకల్ – మిర్యాలగూడెం మధ్య నిర్మించనున్న బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌కు సంబంధించి ప్రాథమిక సర్వే పూర్తయింది. ఖమ్మం జిల్లా పాపటపల్లి నుంచి సూర్యాపేట జిల్లా మిర్యాలగూడెం(జాన్‌పహాడ్) రైల్వే స్టేషన్ వరకు రైల్వే లైన్ నిర్మాణానికి ఈ సర్వే చేపట్టారు. జిల్లాలోని ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో ప్రాథమికంగా సర్వే పూర్తికాగా.. త్వరలోనే తుది సర్వే చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా విస్తృత ప్రచారం కల్పించాలని రైల్వే ఉన్నతాధికారులు తాజాగా కలెక్టర్‌కు లేఖ రాశారు.

తగ్గనున్న దూరం

ఈ రైల్వే లైన్ ప్రధానంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు తరలించేందుకు ఉపయోగపడుతుంది. పాపటపల్లి స్టేషన్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోటమర్రి –జగ్గయ్యపేట–జాన్‌పహాడ్ రైల్వేలైన్ మీదుగా బొగ్గు తరలిస్తారు. తద్వారా దూరం తగ్గి బొగ్గు తరలింపులో వేగం పెరుగుతుందని భావిస్తారు. ఈమేరకు తాత్కాలిక అలైన్‌మెంట్ కోసం కొత్త రైల్వే లైన్ ప్రతిపాదన ప్రాంతాల్లో తుది సర్వే కోసం విస్తృత ప్రచారం కల్పించాలన్న రైల్వే ఉన్నతాధికారుల లేఖతో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో మూడు మండలాలు

ప్రతిపాదన రైల్వే లైన్ జిల్లాలోని మూడు మండలాల మీదుగా వెళ్తుంది. ఖమ్మం రూరల్ మండలంలోని జాన్‌బాద్ తండా, బోడ వీరా, దారెడు, గుడల్ల తండా, గూడూరుపాడు, ఎం.వెంకటాయపాలెం, ఆరెకోడు, ఆరెంపుల, బూర్గుగూడెం, పొన్నెకల్లు, మద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ మండలంలోని లక్ష్మీపురం, మేడేపల్లి, దనియాలగూడెం, కట్టకూరుతోపాటు నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, నేలకొండపల్లి, బోదులబండ, పైనంపల్లి మీదుగా వెళ్లి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ వద్ద కలుస్తుంది.

సర్వే ప్రక్రియను వేగవంతం చేయండి



గణాంకదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక, డీఆర్వో శిరీష, అధికారులు

ఓటర్ల జాబితాపై కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఓటర్ల జాబితాకు సంబంధించి ఇంటింటికీ సర్వే ప్రక్రియలో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఆర్‌ఓలు, తహసీల్దార్లతో సమావేశమై మాట్లాడుతూ ఉద్యోగులు పూర్తి అవగాహన సర్వే చేయాలని సూచించారు. అర్హులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తూనే అనర్హుల పేర్లు తొలగించాలని, ప్రతి ఇంటి నుండి సెల్ నంబర్ సేకరించాలని తెలిపారు.

58, 59 జీఓ దరఖాస్తులపై సమీక్ష

జిల్లాలో 58, 59 జీఓల ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమావేశమైన ఆయన ఆయా జీఓల ద్వారా అందిన దరఖాస్తులు, పరిష్కరించి వాటి వివరాలు ఆరా తీశాక సూచనలు చేశారు.

గణాంకదర్శిని పుస్తకావిష్కరణ

గణాంకదర్శిని పుస్తకాన్ని కలెక్టర్ గౌతమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన, రూపకల్పనలో ఇందులో గణాంకాలు దోహదపడతాయని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో శిరీష, సీపీఓ శ్రీనివాస్, ఆర్డీఓ సూర్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దశరథ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో పరీక్ష జరగనుండగా, అభ్యర్థులు బుధవారం నుంచి హాల్‌టికెట్లు డౌన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. www.tsstudycircle.co.in వెబ్‌సైట్ నుండి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు సమాచారం కోసం 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులోని తరుణీ హాట్‌లో రైసెట్ ద్వారా స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ నవీన్‌బాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ ఉంటుందని, 18 నుంచి 45 ఏళ్ల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పించడమే కాక యూనిఫాం, టూల్ కిట్ ఇస్తామని తెలిపారు. ఎస్సెస్సీ మెమోతో పాటు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, నాలుగు ఫొటోలు, బ్యాంక్ పాస్‌బుక్‌తో సహా సంప్రదించాలని, వివరాలకు 63014 38045, 98850 62799 నంబర్లలో ఫోన్ చేయాలని సూచించారు.

కూలీలందరికీ 'ఉపాధి'



ఇంకుడుగుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన, తదితరులు

రఘునాథపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలందరికీ గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని రేగులచలకలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా చేపట్టిన పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి హాజరు వివరాలు ఆరా తీశారు. అనంతరం కూలీలందరికీ పని కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. ఏపీడీ వెంకటరాజు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కొర్లపాటి రామారావుతో పాటు పద్మయ్యనాయుడు, నున్నా వెంకటేశ్వర్లు, నున్నా శ్రీనివాసరావు, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆశలు రేకెత్తించిన వరుణుడు

- జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు
- చల్లబడిన వాతావరణం



తిరుమలాయపాలెం : ఎదుళ్లచెరువులో పత్తి పంటలో నిలిచిన నీరు

ఖమ్మంవ్యవసాయం: వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంది. వరుణుడి కరుణతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు తేలికపాటి జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎండవేడి, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. జిల్లా కేంద్రంతో పాటు ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కొణిజర్ల, తిరుమలాయపాలెం, కూసుమంచి, ముదిగొండ, చింతకాని మండలాల్లో వర్షపాతం నమోదైందని తెలిసింది. అయితే, 60 మి.మీ.ల స్థాయిలో వర్ష ప్రభావం ఉంటేనే ఇప్పటికే విత్తిన పత్తికి మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. మరోపక్క వర్షం కొనసాగితే వెదజల్లే పద్ధతిలో వరి సాగుకు పలువురు, మిగతా వారు నార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 75 వేల ఎకరాల్లో పంటలు సాగు కాగా, వర్షపాతం పెరిగితే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అధికారులు వెల్లడించిన వివరాల ఆధారంగా రానున్న ఐదు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉంది. కానీ తేలికపాటి నేలల్లో 50 నుంచి 60 మి.మీ., బరువు నేలల్లో 60 నుంచి 70 మి.మీ.ల వర్షపాతం నమోదై 15–20 సెం.మీ.ల లోతు తడి చాకే పంటల సాగులో సిద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈనెల 20వతేదీ వరకు పత్తి, పెసర, కంది, వేరుశనగ, మొక్కజన్న పంటలను 15 వరకు విత్తుకోవచ్చని.. వరి మాత్రం సమృద్ధిగా నీరు ఉన్న ప్రాంతాల్లో మధ్యకాలిక రకాలు, నీటి వనరుల ఆధారంగా స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని చెబుతున్నారు.

రెండోసారి చేసే నేరానికి కఠిన శిక్షలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జావేద్‌పాషా



జైలులో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: తెలిసో తెలియకో చేసిన మొదటిసారి నేరం నుంచి బయటపడ్డాక మళ్లీ అదే నేరం చేస్తే చట్టసంస్థలు కఠినంగా పరిగణిస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలిపారు. జిల్లా జైలును మంగళవారం సందర్శించిన ఆయన ఆరు నెలల కన్నా ఎక్కువ కాలం నుంచి ఉన్న విచారణ ముద్దాయిలతో మాట్లాడారు. దర్యాప్తు నివేదికలు పోలీసులు సకాలంలో దాఖలు చేస్తున్నారా, కేసు పురోగతి ఎలా ఉంది, న్యాయవాదిని నియమించుకునే స్థోమత కలిగి ఉన్నారా అని ఆరా తీశారు. విచారణ ముద్దాయి బయటకు వెళ్తే తిరిగి వస్తాడనే నమ్మకాన్ని కోర్టుకు కలిగించినప్పుడే బెయిలు మంజూరవుతుందని, ఈవిషయాన్ని గుర్తించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జైలు అధికారులు ఏ.శ్రీధర్, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లూరులో షాదీఖానా నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్



స్థలవివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

కల్లూరు: కల్లూరులో రూ.75 లక్షలతో నిర్మాణం చేపడుతున్న షాదీఖానాకు సంబంధించి స్థల వివాదం పరిష్కారమైంది. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌లు మంగళవారం వివాదస్పద స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా అటవీశాఖ స్థలాన్ని షాదీఖానా నిర్మాణానికి అప్పగించాలని, అందుకు బదులు కల్లూరులో వేరే స్థలాన్ని సేకరించి ఇవ్వాలనిఆర్‌డీఓ సూర్యనారా యణను కలెక్టర్ ఆదేశించారు. దీంతో కొద్దిరోజులుగా అటవీశాఖ అధికారులు, ముస్లిం కమిటీ సభ్యులకు మధ్య నెలకొన్న వివాదం పరిష్కారమైనట్లయింది. ఈమేరకు షాదీఖానా నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని కలెక్టర్ కమిటీకి సూచించగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్‌ఆర్‌ఓ అరవింద్, డీఆర్‌ఓ ఎ.నాగమణితో పాటు డాక్టర్ లక్కినేని రఘు, సయ్యద్ అలీ, షేక్ ఇమాం, ఎం.డీ.ఇస్మాయిల్, ఎస్.కే.కమ్లీ, ఎస్.కే.యాకూబ్ అలీ, ఎం.డీ.హనీఫ్, ఎస్.డీ.ఇషాక్, ఎస్.డీ.రవూఫ్, యాకూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 6వ తేదీన టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు కొండపల్లి శ్రీరాం తెలిపారు. ఐటీఐ లేదా డిప్లొమా చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. సుమారు 600మంది వరకు అవకాశం ఉండగా, ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు మొదలయ్యే జాబ్‌మేళాకు అన్ని ధృవపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

బాలల సంరక్షణ విభాగంలో ఖాళీల భర్తీ

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని బాలల సంరక్షణ విభాగంలో ఖాళీ ఉద్యోగాలను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈమేరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతి వివరాలను వెల్లడించారు. కౌన్సిలర్, గృహ మేనేజర్, సోషల్ వర్కర్, ఏఎన్‌ఎం/నర్సు, అసిస్టెంట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆయా పోస్టులను భర్తీ చేయనున్నామని తెలిపారు. ఆయా ఉద్యోగులకు సరిపడా అర్హతలు ఉన్న వారు ధృవపత్రాలు జతచేసిన దరఖాస్తులను ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా బుర్హాన్‌పురంలోని పాత డీఆర్డీఓ ఆఫీస్‌లో కొనసాగుతున్న బాల రక్షా భవన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఎంపిక పోటీలను పరిశీలించిన డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

పెనుబల్లి : క్రీడా పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు మండల స్థాయి పోటీలు జరుగుతున్నాయి. ఈమేరకు మండలంలోని వీఎం బంజర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం జరిగిన పోటీలను డీఈఓ సోమశేఖరశర్మ పరిశీలించారు. ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం బండి నరసింహారావు, పీఈటీ గంగా ప్రసాద్‌తో పాటు బండి రాము, రవీంద్ర, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి, కేసు నమోదు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెకోడులో మహిళపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కానుగుల జ్యోతి ఆమె సోదరుడు వెంకటేశ్వర్లు చేనులో పత్తి విత్తనాలు నాటుతోంది. అయితే, కొలిచెలం బాబు ఆయన పొలంతో పాటు వెంకటేశ్వర్లు పొలం గట్టు దున్నుతుండగా ఇదేమిటని ప్రశ్నించింది. దీంతో బాబు రాళ్లతో జ్యోతిపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	9,500	9,400
పెసలు	7,450	7,150
మిర్చి	19,600	13,500
ఏసీ మిర్చి	24,600	18,500
పత్తి	6,900	5,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

మురుగు కాదు.. ఇక మెరుగు!



మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్ (ఫైల్)

మున్సిపాలిటీల్లో మురుగు నీటిశుద్ధి ప్లాంట్లు

- ఉమ్మడి జిల్లాకు 19 ప్లాంట్లు మంజూరు
- భద్రాద్రి జిల్లాలో 13, ఖమ్మం జిల్లాలో ఆరు ప్లాంట్లు
- భూమి కేటాయించాలని తహసీల్దార్లకు లేఖలు

ఇల్లెందు: నిన్నటి వరకు తడి, పొడి వ్యర్థాల నుంచి ఎరువుల తయారీకి ప్లాంట్లు ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పుడు మురుగునీరు శుద్ధి ప్లాంట్లపై దృష్టి సారించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 19 మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు మంజూరయ్యాయి. ఆయా ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించి అప్పగించాలని కలెక్టర్లు స్థానిక మున్సిపాలిటీల అధికారులకు సూచించారు. ఇప్పటికే ఆయా పట్టణాల్లో మురుగునీరు అత్యధికంగా ప్రవహించే లోతట్టు ప్రాంతాలను శాటిలైట్ చిత్రాల సాయంతో గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మురుగునీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయించారు.

ప్రతీ ఇంటి నుంచి మురుగునీరు

ప్రతీ ఇంట్లోని సెప్టిక్ ట్యాంక్‌తో పాటు స్నానపు గదులు, దుస్తులు శుభ్రం తదితర అంశాల ఆధారంగా నీరు బయటకు వస్తుంటుంది. అయితే, చాలా ఇళ్లల్లో ఇంకుడు గుంతలు లేవు. దీంతో నీరంతా వృథాగా కాల్వల ద్వారా జలాశయాల్లోకి చేరుతుంది. ఈ కారణంగా జలాశయాల్లోని నీరు కలుషితమై అటు జీవరాశులకు ముప్పు వాటిల్లడమే కాక తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తే అనర్థాలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ నీటిని ప్రత్యేక కేంద్రాలకు తరలించి శుద్ధి చేయడం ద్వారా జలాశయాలకు ముప్పు తొలగిపోనుండగా.. ఇతర అవసరాలకు ఉపయోగించుకోవచ్చనే నిర్ణయానికి వచ్చారు.

ఎలా పని చేస్తుందంటే..

పట్టణాల నుంచి విడుదలయ్యే మురుగు నీరంతా శుద్ధి కేంద్రాలకు చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. కేంద్రాల్లో నీటిని శుద్ధి చేశాక ఇతర అవసరాలకు వినియోగించడం ద్వారా వృథా కాకుండా కట్టడి చేసినట్లవుతుంది. ఈ నీటిని మొక్కల పెంపకం, పంటల సాగు తదితర అవసరాలకు వినియోగిస్తామని చెబుతున్నారు. అంతేకాకుండా నీటిని శుద్ధి చేశాక మిగిలే వ్యర్థాలతో ఎరువు తయారుచేసి మొక్కల పెంపకం, పంటల సాగుకు అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాకు మంజూరైన కేంద్రాల వివరాలు

మున్సిపాలిటీ	నిర్మాణ ప్రాంతం	ప్లాంట్ సామర్థ్యం (ఎంఎల్‌డీ)	స్థల కేటాయింపు (ఎకరాల్లో)
కొత్తగూడెం	రామవరం	9.00	4.02
	విద్యానగర్	3.50	1.30
	భువన గార్డెన్స్	3.50	1.30
	ముర్రేడు వాగు	1.00	0.25
మణుగూరు	టెక్నో స్కూల్	5.00	2.19
	శివలింగాపూర్	1.50	0.36
పాల్వంచ	గుడిపాడు	10.00	4.00
	మంచికంటినగర్	2.50	1.10
	కేసీఆర్‌నగర్	1.00	0.25
	వెంగళరావునగర్	3.50	1.30
ఇల్లెందు	రైల్వేస్టేషన్	6.00	2.23
	సుదిమళ్ల గురుకులం	1.00	0.25
మధిర	జీకే పౌల్ట్రీ	6.00	2.28
	మడుపల్లి హైస్కూల్	1.00	0.25
సత్తుపల్లి	రాజీవ్‌కాలనీ	3.00	1.20
	వేశ్యాకాంతుల చెరువు	2.00	1.20
	తామరచెరువు	1.00	0.25
	వెంగళరావునగర్	1.00	0.25
వైరా	మార్కెట్ యార్డు	6.50	2.37

త్వరలోనే పనుల ప్రారంభం



ఇల్లెందు మున్సిపాలిటీకి రెండు మురుగు నీటి శుద్ధి కేంద్రాలు మంజూరయ్యాయి. భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగానే టెండర్లు ఆహ్వానిస్తాం. ప్లాంట్లుఅందుబాటులోకి రాగానే మురుగునీటి సమస్య పరిష్కారమవుతుంది. ఈ మేరకు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

–అంకుషావలి, కమిషనర్, ఇల్లెందు మున్సిపాలిటీ

కొరవడుతున్న పర్యవేక్షణ

- ఎస్సీ వసతిగృహాల్లో సిబ్బందిదే పెత్తనం
- విద్యార్థులతో పనులు... బెదిరింపులు
- బయట పనులకు వెళ్తూ హాస్టల్ నిర్వహణపై నిర్లక్ష్యం



చెరువు మాదారం హాస్టల్‌లో సమస్యలు వెల్లడిస్తున్న విద్యార్థి (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ప్రభుత్వ వసతిగృహాలను సంక్షేమ శాఖల డివిజనల్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని తెలుస్తుంది. దీంతో నాలుగో తరగతి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులపై పెత్తనం చెలాయిస్తున్నారు. వీరు కూడా సొంత పనులకే ప్రాధాన్యత ఇస్తూ హాస్టళ్ల నిర్వహణను పట్టించుకోకపోగా, ప్రశ్నించిన విద్యార్థులపై చేయి చేసుకోవడం పరిపాటిగా మారింది.

చూసేది లేదు..

ఎస్సీ సంక్షేమశాఖకు సంబంధించి వసతిగృహాల నిర్వహణను మూడు డివిజన్లగా విభజించి ముగ్గురు ఏఎస్‌డబ్ల్యూఓ(అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్)లను నియమించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా డివిజన్ల పరిధిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు ఉండగా... ఏఎస్‌డబ్ల్యూఓలు తరచుగా పర్యవేక్షించి, రిజిస్టర్లను తనిఖీ చేయాలి. కానీ ఖమ్మం ఏఎస్‌డబ్ల్యూఓ వసతిగృహాల వైపు చూసిన దాఖలాలే లేవని చెబుతున్నారు. ఖమ్మంలోనూ నిర్వహణ లోపభూయిష్టంగామారిన వసతిగృహాలు ఉన్నా పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. శాఖ ఉన్నతాధికారి నెలకు ఒకటి, రెండు సార్లు హాస్టళ్లకు వెళ్తున్నా ఏఎస్‌డబ్ల్యూఓ మాత్రం రెండు, మూడు నెలలకోసారి కూడా వెళ్లడం లేదని సమాచారం. ఎవరికైనా ఆ అధికారితో పని ఉండి వెళ్తే 11.30 గంటల వరకు రావడం లేదని తెలుస్తోంది.

విద్యార్థులతో పనులు.. వారిపై దాడి

ఖమ్మం డివిజన్‌లోని జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల వసతిగృహాల్లో పనిచేసే సంక్షేమ అధికారులు వసతిగృహాలకు సక్రమంగా వెళ్లడం లేదు. ఫలితంగా నాలుగో తరగతి సిబ్బందిదే రాజ్యంగా మారింది. విద్యార్థులతో పనులు చేయించడమే కాక ఎవరైనా ఎదురుతిరిగితే చేయి చేసుకుంటున్నారని కొందరు తమకు పెద్దల అండదండలు, రాజకీయ పలుకుబడి ఉందని బెదిరిస్తున్నట్లు సమాచారం. మరికొందరు బయట పనులు, వ్యాపారాలు చేసుకుంటూ హాస్టళ్ల ముఖమే చూడడం లేదని తెలుస్తోంది. వీరిలో ఔట్ సోర్సింగ్ సిబ్బందే అధికంగా ఉన్నారన్న చర్చ జరుగుతుంది.

వీరు పట్టించుకోరు.. వారు వెళ్లరు..

డివిజనల్ అధికారులు హాస్టళ్లను పర్యవేక్షించకపోవడంతోనే సంక్షేమ అధికారులు కూడా అదే బాటలో పయనిస్తున్నారు. వీరు రెగ్యులర్‌గా హాస్టళ్లకు వెళ్లకపోవడంతో సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలోని ఎస్సీ బాలుర ప్రీ మెట్రిక్ వసతిగృహానికి రెగ్యులర్ అధికారి లేక నేలకొండపల్లి అధికారికి ఇన్‌చార్జి ఇచ్చారు. ఆయన పెద్దగా వెళ్లకపోవడంతో చెరువుమాధారం సిబ్బంది పెత్తనం చెలాయిస్తుండగా ఇటీవల కొందరు విద్యార్థులపై చేయి చేసుకున్న ఘటన వెలుగు చూసింది.

పర్యవేక్షిస్తున్నాం..



వసతిగృహాలను తరచుగా పర్యవేక్షిస్తున్నాం. హాస్టళ్లోని నాలుగో తరగతి సిబ్బంది అతిగా ప్రవర్తించొద్దని సూచనలు చేశారు. విద్యార్థులను కొట్టే అధికారం ఎవరికీ లేదు. చెరువుమాదారంలో జరిగిన ఘటనపై వసతిగృహానికి వెళ్లి విచారించా. విద్యార్థులపై చేయి చేసుకున్న సిబ్బందిని బదిలీ కూడా చేశారు.

– శ్రీలత, ఖమ్మం డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓ

'బండి'ని తప్పించడంపై ఆత్మహత్యాయత్నం



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి బండి సంజయ్‌ను తప్పించడాన్ని జీర్ణించుకోలేక బీజేపీ ఖమ్మం టౌన్ ఉపాధ్యక్షుడు గజ్జెల శ్రీనివాస్ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈమేరకు సంజయ్‌ను పదవి నుంచి తొలగించినట్లు తెలుసుకున్న ఆయన ఇంట్లోని గదిలోకి ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించి కుటుంబీకులు ఆయనను ఉరి నుంచి తప్పించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. కాగా, 'నా పేరు గజ్జెల శ్రీనివాస్. ఖమ్మం భారతీయ జనతా పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు. దానవాయిగూడెం కాలనీ. బండి సంజయ్ అన్నను రాష్ట్ర అధ్యక్ష నుంచి తొలగించడం నాకు బాధాకరం. నేను జీర్ణించుకోలేకపోతున్నాను. ఎవరి మీద కోపం కాదు...' అంటూ ఆయన లేఖ కూడా రాశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు రుద్ర ప్రదీప్ తదితరులు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

12కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపాన ఎక్సైజ్ పోలీసులు మంగళవారం చేపట్టిన తనిఖీల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా రాష్ట్రంలోని మల్కాన్‌గిరికి చెందిన రాహుల్ మండల్ 12కేజీల గంజాయితో హైదరాబాద్ వెళ్తుండగా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు అచ్చారావు, రబ్బానీ, సిబ్బంది రామారావు, నాగేశ్వరరావు, శశికాంత్, విశ్వనాథం, రవి, రమేష్, నిర్మల, కృష్ణవేణి పాల్గొన్నారు.

వైరాలో 250 గ్రాములు

వైరా: గంజాయితో ప్రయాణిస్తున్న యువకుడిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... ఖమ్మంకు చెందిన పులుసు సాకేత్ భద్రాచలంలో 250గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేసి మంగళవారం బస్సులో వస్తూ వైరాలో దిగాడు. ఈక్రమంలో ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకుని రూ.5వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు షేక్ ముబషీర్ అహ్మద్, ఎం.ఏ.కరీమ్, హరీష్, సుధీర్, వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువుమాదారం హాస్టల్ కామాటి బదిలీ

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం ఎస్సీ బాలుర ప్రీ మెట్రిక్ హాస్టల్ ఘటనపై ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థులను కామాటి సత్యానందం కొట్టగా, ఆయనపై తల్లిదండ్రులు దాడి చేశారు. దీంతో ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలత విచారణ అనంతరం ఇన్‌చార్జ్ వార్డెన్ బాలకృష్ణతో వివరాలు ఆరా తీశారు. ఈమేరకు కామాటి సత్యానందంను బదిలీ చేయడమే కాక రెగ్యులర్ వార్డెన్ నియామకానికి కలెక్టర్‌కు ఫైల్ పంపినట్లు డీడీ తెలిపారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరావు

ఖమ్మంఅర్బన్: క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ మందా సంజీవరావు కోరారు. ఖమ్మం ప్రశాంతినగర్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 3లక్షల మందికి పైగా క్రైస్తవులు ఉన్నా ఎలాంటి ప్రాధాన్యత లభించడం లేదని చెప్పారు. చాలా ప్రాంతాల్లో శుభకార్యాలు జరుపుకునేందుకు కమ్యూనిటీ హాళ్లు, ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు శ్మశానవాటికలు కూడా లేవన్నారు. ఇకనైనా స్థలాలు కేటాయించడమే కాక పాస్టర్లకు గౌరవ వేతనం, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల బాధ్యులు సీహెచ్.రమేష్‌బాబు, జి.లూకారాజు, జిపాల్ సంజీవరావు, వి.ఇమ్మానుయేలు, ఓ.ముసామియా, ఎల్.యేసురత్నం, ఎస్.త్యాగరాజు, కె.సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత

రూ.2లక్షల నగదుతో పాటు విలువైన పత్రాలు



సావిత్రికి బ్యాగ్ అందజేస్తున్న డీఎం దేవదానం

మధిర: బస్సులో ప్రయాణికురాలు నగదు, విలువైన పత్రాలతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోగా, కండక్టర్ గుర్తించి అప్పగించడం ద్వారా నిజాయితీని చాటుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన సావిత్రి మంగళవారం వైరాలో మధిర డిపో బస్సు ఎక్కగా.. బస్సు కదిలే సమయాన తన కుమారుడు రాలేదని గుర్తించి బ్యాగ్ మరిచిపోయి దిగింది. ఆతర్వాత ఆమె వైరా బస్టాండ్‌లో కంట్రోలర్ ఆర్.ఉప్పలయ్యకు సమాచారం ఇవ్వగా ఆయన కండక్టర్ సుశీలకు ఫోన్ చేశాడు. దీంతో సుశీల బ్యాగ్‌ను తీసుకుని మధిర డిపోలో అందజేయగా వారు సావిత్రికి ఇచ్చారు. బ్యాగ్‌లో రూ.2లక్షల నగదు, బ్యాంకు పుస్తకాలు, దుస్తులు, ఆధార్ కార్డులు ఉన్నాయి. ఈమేరకు డిపో మేనేజర్ ఎస్.దేవదానం, ఉద్యోగి టీసీఎస్.రెడ్డి, కంట్రోలర్ ఉప్పలయ్య, కండక్టర్‌కు సావిత్రి కృతజ్ఞతలు తెలపగా వారు కండక్టర్‌ను అభినందించారు.

'పండితాపురం' ఘటనపై భట్టి ఆరా

క్షతగాత్రులకు భట్టి, కనకయ్య పరామర్శ



గాయపడిన కార్యకర్తలను పరామర్శిస్తున్న భట్టి

ఖమ్మం వైద్యవిభాగం: కామేపల్లి మండలం పండితాపురంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ జరగగా ఇరువర్గాల్లో ఏడుగురు గాయపడ్డారు. ఈ మేరకు ఘటనపై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరా తీశారు. అలాగే, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్తలను భట్టి మంగళవారం ఆయన పరామర్శించారు. తెలంగాణ జన గర్జన సభకు భారీగా జన సమీకరణ చేశామనే కోపంతో బీఆర్‌ఎస్ నాయకులు తమపై దాడి చేశారని బత్తుల నాగరాజు, బానోతు రామచంద్రు, మేకపోతుల మహేష్ తదితరులు వివరించారు. దీంతో స్పందించిన భట్టి మాట్లాడుతూ నిందితులపై చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులతో మాట్లాడడమే కాక, గాయపడిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే, జనగర్జన సభకు వచ్చి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన కలకోట వాసి ఖాసీంను పరామర్శించారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కూడా పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుడు హన్మంతరావు ప్రోద్బలంతోనే తమపై దాడి జరిగిందని వారు వివరించారు. ఈకార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొట్ల నాగేశ్వరరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, పైడిపల్లి కిషోర్, బాబు, బనాల నరసింహారావు, కందిమల్ల వీరబాబు, వనం బాబు, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, మద్ది వీరారెడ్డి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు పాల్గొన్నారు.

నేడు పండితాపురం సంతకు సెలవు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం పండితాపురంలో ప్రతీ బుధవారం జరిగే సంతకు ఈ వారం సెలవు ప్రకటించినట్లు మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితుల ఆధారంగా పోలీసుల సూచన మేరకు ఈ ర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈమేరకు అమ్మకందారులు, కొనుగోలుదారులు గమనించాలని సూచించారు.

కొడుకును చివరిచూపూ చూడలేం..

- ఒడిశాకు చెందిన తల్లిదండ్రులు ఆవేదన
- ముంబై వెళ్లివస్తూ రైలు ప్రమాదంలో యువకుడు మృతి

ఖమ్మంక్రైం: ఉపాధి నిమిత్తం ఆ యువకుడు ముంబై వెళ్లాడు. అంతోఇంతో డబ్బు సంపాదించుకున్న ఆయనకు అక్కడ యువకుడు పరిచయం కాగా సెలవు దొరకడంతో స్నేహితుడితో కలిసి తన తల్లిదండ్రులు, గ్రామాన్ని పరిచయం చేయటానికి రైలులో బయలుదేరాడు. కానీ విధి మధ్యలో ఆయనను బలి తీసుకోగా.. కుమారుడి కడచూపుకు కూడా రాలేని నిరుపేద తల్లిదండ్రుల వ్యథ ఇది. ఒడిశా రాష్ట్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన అలెక్స్(18) బ్రతుకుదెరువు కోసం ముంబై వెళ్లాడు. అక్కడ తనకు పరిచయమైన నిప్పు అనే యువకుడితో స్నేహం కుదరగా ఇటీవల సెలవులు రావడంతో ఇద్దరూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. జనరల్ బోగీలో సీటు దొరకకపోవటంతో అలెక్స్ ఫుట్‌బోర్డ్ వద్ద నిల్చుని ఉండగా ఖమ్మం సమీపాన రామన్నపేట వద్ద మంగళవారం ఉదయం నిద్రమత్తులో ఉన్న అలెక్స్ కింద పడిపోయాడు. దీంతో నిప్పు చైన్ లాగి చూడగా అప్పటికే అలెక్స్ మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న జీఆర్పీ సిబ్బంది అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అనంతరం అలెక్స్ తల్లిదండ్రులకు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు సమాచారం ఇవ్వగా, ఖమ్మం రావడానికి తమ వద్ద డబ్బులు లేదని రోదిస్తూ కొడుకు చివరిచూపునకు తాము నోచుకోలేమని వాపోయారు. దీంతో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించే బాధ్యత అన్నం శ్రీనివాసరావుకు అప్పగించాలనే యోచనకు వచ్చారు.

మానసికస్థితి సరిగ్గా లేని యువతి ఆత్మహత్య

రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

ఖమ్మంక్రైం: మానసిక స్థితి బాగాలేక ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ యువతి ఆత్మహత్య చేసుకోగా, రెండు రోజుల తర్వాత కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించారు. ఖమ్మం పార్సి బంధం ప్రాంతంలో నివాసముంటున్న ఊట్కూరు ఏసుపాదంకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నకూతురు హైదరాబాద్‌లో తల్లితో కలిసి ఉండగా, పెద్దకూతురు దైవకృప(30)కు మానసిక స్థితి సరిగా లేక ఖమ్మంలోనే తండ్రితో ఉంటోంది. ఈనెల 2వ తేదీన ఆయన హైదరాబాద్ వెళ్లగా ఇంట్లో దైవకృప మాత్రమే ఉంది. ఆదివారం సాయంత్రం కూడా ఇంటి ముందు పోర్షన్‌లో ఉన్న వారితో మాట్లాడగా వారు సోమవారం ఉదయం ఊరికి వెళ్లారు. అయితే, ఏసుపాదం ఫోన్ చేస్తున్నా దైవకృప తీయకపవడంతో ఆయన మంగళవారం వచ్చి చూడగా ఉరి వేసుకున్న దైవకృప మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో వేలాడుతోంది. దీంతో ఆయన ఖమ్మం వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ వెంకటేష్ చేరుకుని వివరాలు ఆరా తీశారు. కాగా, ఆమె ఆదివారం రాత్రి ఉరి వేసుకున్నట్లు భావిస్తుండగా, అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

తాగునీటి పైపులైన్ గుంతలో పడిన వ్యక్తి



గుంతలో పడిన రామును బయటకు తీస్తున్న స్థానికులు

సత్తుపల్లి టౌన్: ప్రమాదవశాత్తు పైప్ లైన్ గుంతలో పడిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని కల్పతరు రోడ్డుకు చెందిన బర్రె రాము ద్విచక్ర వాహనంపై స్థానిక జవహర్ నగర్ నుంచి రింగ్ సెంటర్ వైపు వస్తున్నాడు. ఈక్రమంలో పైప్‌లైన్ మరమ్మతుల కోసం తీసిన ఐదు అడుగుల లోతు గుంతలో ఆయన ప్రమాదవశాత్తు వాహనంతో పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు గుర్తించి 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన రిటైర్డ్ ఉద్యోగి మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పుట్టకోట క్రాస్‌రోడ్డు వద్ద గతనెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయనగర్‌కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కొల్లువీరయ్య(68) మంగళవారం మృతి చెందాడు. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో వీరయ్యకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మంలో చికిత్స చేయించిన కుటుంబీకులు హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఈ మూడు నెలలే కీలకం

సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్

గోదావరిఖని: వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రానున్న మూడునెలలే కీలకమని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. మంగళవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 75 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకోవాల్సి ఉంటుందని, వర్షాకాలంలో ఓసీపీల్లో ఉత్పత్తి కుంటుపడకుండా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రోజుకు 2లక్షల టన్నులు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వర్షాలు కురిసినా ఓసీపీల్లో నీటినిల్వలు పెరగకుండా చూడాలని, ఇందుకు భారీ పంపులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రవాణాకు ఇబ్బంది లేకుండా హాల్ రోడ్లను పటిష్టం చేయాలన్నారు. వర్షాకాలంలో భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఉండదని, ఎక్కువ ఉత్పత్తిపై కృషి చేయాలని తెలిపారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు నుంచి రోజుకు సగటున 7 వేల టన్నులు తగ్గకుండా ఉత్పత్తి చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో రోజుకు సగటున కనీసం 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలన్నారు.

ఈ నెలలో ఏరియాలవారీగా లక్ష్యాలివే..

● కొత్తగూడెం ఏరియాలో రోజుకు 41 వేల టన్నులు ● మణుగూరులో 40 వేల టన్నులు ● ఆర్జీ–2లో 24 వేల టన్నులు ● శ్రీరాంపూర్ ఏరియాలో 19 వేల టన్నులు ● ఆర్జీ–3లో 14,500 టన్నులు ● బెల్లంపల్లి ఏరియాలో 14 వేల టన్నులు ● మందమర్రి నుంచి 12 వేల టన్నులు ● ఆర్జీ–1 నుంచి 11,500 టన్నులు ● భూపాలపల్లి నుంచి 10 వేల టన్నులు ● ఇల్లందు ఏరియా నుంచి 9వేల టన్నుల చొప్పున సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

రావమ్మా మహాలక్ష్మి..



ఏపీలో పెరుగుతున్న అమ్మాయిల సంఖ్య

- వెయ్యి మంది అబ్బాయిలకు 1,046 మంది అమ్మాయిల జననం
- దేశంలో కేరళ తర్వాత ఏపీలోనే అమ్మాయిలు అధికం
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో దశాబ్దాల తరబడి అబ్బాయిలే అధికంగా ఉంటున్నారు. కానీ.. 2021 తర్వాత అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా నివేదిక వెల్లడించింది. శ్రామిక శక్తికి (లేబర్ ఫోర్స్) సంబంధించి 2021– 22 నివేదిక లో ఈ విషయాలను వెల్లడించింది. గతంలో వెయ్యి మంది అబ్బాయిలకు 977 మంది అమ్మాయిలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 1,046కు పెరిగినట్టు నివేదికలో వెల్లడించింది.

ఆరోగ్య కార్యక్రమాల అమలు భేష్

రాష్ట్రంలో ఆరోగ్య కార్యక్రమాలు బాగా అమలు చేస్తుండటం వల్లే అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నట్టు నివేదిక వెల్లడించింది. సాధారణంగా ఆరేళ్లు నిండకముందే బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తి మృతి చెందేవారు. కానీ.. ఈ పరిస్థితులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, క్రమం తప్పకుండా యాంటీనేటల్ చెకప్, వ్యాధి నిరోధక టీకాల అమలు అద్భుతంగా ఉండటం వంటి పరిస్థితుల వల్ల మంచి ఫలితాలు వస్తున్నా యి. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల స్థాయిలోనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ కూడా సత్ఫలితాలు ఇస్తోంది. అమ్మాయిల సంఖ్య పెరగడానికి ఇవి కూడా కారణాలని నివేదిక వెల్లడించింది.

కేరళ తర్వాత ఏపీలోనే అధికం

దేశంలో అమ్మాయిలు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండటం గమనార్హం. కేరళలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,114 మంది అమ్మాయిలు నమోదవుతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 1,046 మంది నమోదయ్యారు. అత్యల్పంగా హర్యానాలో 887 మంది అమ్మాయిలు మాత్రమే నమోదయ్యారు. ఏపీలో పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,063 మంది, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,038 మంది అమ్మాయిలు ఉన్నట్టు నివేదికలో వెల్లడైంది. 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఇండియాలో సగటున ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 968 మంది అమ్మాయిలు నమోదయ్యారు.



వివిధ రాష్ట్రాల్లో వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..

రాష్ట్రం	కేరళ	ఆంధ్రప్రదేశ్	హిమాచల్‌ప్రదేశ్	తమిళనాడు	ఛత్తీస్‌గఢ్	జార్ఖండ్	కర్ణాటక	ఒడిశా	ఉత్తరప్రదేశ్	తెలంగాణ
అమ్మాయిలు	1,114	1,046	1,031	1,026	1,016	1,001	991	988	971	955

ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/కారంచేడు : బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. సంస్థాగతంగా పలు రాష్ట్రాల్లో చేసిన మార్పుల్లో భాగంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా బీజేపీ నియమించింది. ఇప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజుకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఫోన్ చేసి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ టీడీపీకి దగ్గరవుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో పురందేశ్వరి నియామకం రాజకీయవర్గాల్లో చర్చకు దారి తీసింది. మార్చి 2004లో పురందేశ్వరి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సంవత్సరం కాంగ్రెస్ నుంచి బాపట్ల ఎంపీగా పోటీ చేసి సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడుపై గెలుపొందారు. 2006లో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచే విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా 2013 వరకు పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి రాజంపేటలో పోటీ చేసి ఓడిపోయారు. ఆరున్నరేళ్ల నిరీక్షణ తర్వాత 2020 సెప్టెంబర్ 26న పురందేశ్వరిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీజేపీ అధిష్టానం నియమించింది. 2020 నవంబర్‌లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆమెకు బాధ్యతలు అప్పగించింది. ఏపీలో పార్టీ బలోపేతానికి కీలకంగా వ్యవహరిస్తారని, ఎన్టీఆర్ ఛరిష్మాతో టీడీపీ నాయకులను బీజేపీలో చేర్పించడంలో ముందుంటారని అధిష్టానం భావించింది. కానీ రాష్ట్ర వ్యవహారల్లో అధిష్టానం అంచనాలను పురందేశ్వరి అందుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. దీంతో ఆమెకు ఒడిశా బాధ్యతల్లో కోత విధించింది. 2022 సెప్టెంబర్ 9న ఛత్తీస్‌ఘడ్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి కూడా పురందేశ్వరిని తప్పించింది. అప్పటి నుంచి ఆమె కేవలం జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలోనే ఉన్నారు. ఏపీలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సోము వీర్రాజుపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్టీఆర్ ఛరిష్మాను తమకు అనుకూలంగా మార్చుకోగలమనే భావనతో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

మాజీ ఎంపీ మాగుంట హత్య కేసులో... దోషికి బెయిల్

- నెలపాటు విడుదలకు హైకోర్టు ఆదేశం.. ఆ తర్వాత లొంగిపోవాలని స్పష్టీకరణ
- 2 దశాబ్దాలకుపైగా కారాగారంలోనే మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో దోషి, మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్‌ను నెలపాటు మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. అలాగే ఆగస్టు 4న జైలు సూపరింటిండెంట్ ముందు లొంగిపోవాలని ఆయనకు స్పష్టం చేసింది. 1995లో జరిగిన ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో పీబీవీ గణేశ్‌ను 2000 సంవత్సరంలో కోర్టు దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై ఆయన అప్పీల్‌కు వెళ్లినా ఉపశమనం కలగలేదు. దీంతో రెండు దశాబ్దాలకుపైగా జైల్లో ఉంటున్న గణేశ్‌ను సత్ప్రవర్తనగల ఖైదీగా పరిగణించి విడుదల చేయాలని 2016లో రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే ఈ కేసులో సీబీఐ ఇంకొం దరిపై దర్యాప్తు కొనసాగిస్తోందంటూ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గణేశ్ భార్య జోషి మాధవి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. సత్ప్రవర్తన నిబంధనలన్నీ గణేశ్‌కు వర్తిస్తే ఆయన్ను వారంలో విడుదల చేయాలని 2022 సెప్టెంబర్‌లో ఆదేశించారు. కానీ నెలలు గడిచినా కేంద్రం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఏప్రిల్‌లో మాధవి అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తన భర్తకు బెయిల్ ఇవ్వాలని మధ్యంతర అప్లికేషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదిస్తూ సీబీఐ పరిధిలోని కేసు కనుక గణేశ్ విడుదలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీపీ సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ సీబీఐ విచారణ జరిపిన కేసు అయినా సరే.. ఒకసారి శిక్ష పడిన తర్వాత దోషి విడుదల రాష్ట్ర సర్కార్‌కు సంబంధించిన అంశం అవుతుందన్నారు. చట్టప్రకారం అన్నీ సరిగ్గా ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనను తిరస్కరించే అధికారం కేంద్రానికి లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి దోషిని నెల రోజుల కోసం బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించారు.

వెన్నుపోటు వీరుడు.. ప్యాకేజీ శూరుడు!

‘‘ఇవాళ వీళ్ల పరిస్థితి ఏమిటంటే.. చక్రాలు లేని సైకిల్ ఎక్కలేనాయన ఓ నాయకుడు! ఎవరైనా తైలం పోస్తే కానీ గ్లాసు నిండని వ్యక్తి మరో నాయకుడు! ఒకరు వెన్నుపోటు వీరుడు, మరొకరు ప్యాకేజీ శూరుడు! వీరిద్దరికీ పేదల బతుకుల గురించి, ప్రజల కష్టాల గురించి, మాటిస్తే ఆ మాట మీద నిలబడాల్సిన అవసరం గురించి, ఒక మాటకున్న విలువ గురించిగానీ ఏమాత్రం తెలియదు. అలా బతకాలన్న ఆలోచనా లేదు. ఇద్దరూ కలసి ప్రజల్ని మోసం చేస్తూ 2014–19 మధ్య రాష్ట్రాన్ని ఏలారు. ఇద్దరూ కలసి రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలు, సామాజిక వర్గాలకు వెన్నుపోటు పొడిచారు’’

ఓ నీతిమాలిన నాయకుడి కథ..

‘‘ఇవాళ మనం తెరిపిస్తున్న చిత్తూరు డెయిరీ కథ ఎలాంటిదంటే.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ఓ మనిషి తాను స్థాపించిన డెయిరీ కోసం, సొంత లాభం కోసం, సొంత జిల్లా రైతునైనా, పిల్లనిచ్చిన మామనైనా బలి పెట్టేస్తాడని చెప్పే మనిషి కథ ఇది! ఓ నీతిమాలిన రాజకీయ నాయకుడి కథ ఇదీ! ఒక గొప్ప మెడికల్ కాలేజీ మన చిత్తూరుకు వస్తుంటే అడ్డుకున్నది సాక్షాత్తూ ఈ చంద్రబాబునాయుడు, గజదొంగల ముఠా సభ్యుడైన ఈనాడు రామోజీరావు వియ్యంకుడే. స్థలాలివ్వకుండా ఈ గడ్డకు మంచి మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకున్న చరిత్ర వారిదే. వేలూరు మెడికల్ కాలేజీకి జరిగిన అన్యాయాలను పూర్తిగా సరిదిద్దుతూ ఈరోజు అడుగులు ముందుకు వేస్తున్నా’’

– చిత్తూరు బహిరంగ సభలో సీఎం జగన్

‘చిత్తూరు’కు క్షీరాభిషేకం!

- దశాబ్దాల చరిత్ర కలిగిన అతిపెద్ద డెయిరీకి ప్రాణ ప్రతిష్ట
- చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు ఏపీ సీఎం జగన్ శ్రీకారం



చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి: గత పాలకుల స్వార్థంతో రెండు దశాబ్దాలుగా మూతబడ్డ చిత్తూరు డెయిరీకి జీవం పోస్తూ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో భూమి పూజ చేశారు. అనంతరం చిత్తూరు సమీపంలోని చీలాపల్లి సీఎంసీ మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

రూ.150 కోట్లతో తొలిదశ పనులు

ఇలాంటి మంచి కార్యక్రమంలో భాగంగా రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ తొలిదశ పనులు మొదలవుతున్నాయి. దాదాపు లక్ష లీటర్లతో మరో 10 నెలల వ్యవధిలో పాల ప్రాసెసింగ్ మొదలవుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడే దశలవారీగా బటర్, పాలపొడి, యూహెచ్‌టీ పాల విభాగం, ఛీజ్, పనీర్, యోగర్ట్, స్వీట్ తయారవుతాయి. ఐదు నుంచి ఏడెనిమిదేళ్లలో 10 లక్షల లీటర్లు ప్రాసెస్ చేసే స్థాయికి డెయిరీ చేరుకుంటుంది. దీనిద్వారా 5 వేల మందికి ప్రత్యక్షంగా ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. మరో 2 లక్షల మందికి అమూల్ రాకతో అవుట్‌లెట్స్, డిస్ట్రిబ్యూషన్ చానెళ్ల ద్వారా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. చిత్తూరు జిల్లానే కాకుండా రాయలసీమకు చెందిన పాడి రైతన్నలు, అక్కచెల్లెమ్మలకు మంచి పాల సేకరణ ధర లభిస్తుంది.

జిల్లా వార్తలు

నేటి నుంచి రెండు రాష్ట్రాల పురోహితుల క్రికెట్ టోర్నీ



టోర్నీ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నీ జరగనుంది. వివరాలను నిర్వాహకులు అవధానుల సాయినాథ్‌శర్మ, నందుల సంతోష్‌శర్మ, రంగావజ్జుల దిలీప్‌శర్మ, శేషభట్టార్, ప్రశాంతులచార్యులు, యడవల్ల అనిరుథ్‌శర్మ మంగళవారం వెల్లడించారు. స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యాన ఈనెల 10 వరకు జరిగే పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రెండు రాష్ట్రాల నుంచి 16 జట్లు టోర్నీకి హాజరు కానుండగా, నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మ్యాచ్‌ల నిర్వహణకు జిల్లాలోని సీనియర్ క్రికెటర్లు, అంపైర్లు సహకారం అందిస్తున్నారని వారు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



మధుసూదన్‌రావు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నాంపల్లి మధుసూదన్‌రావుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆయన హైదరాబాద్‌లోని వివేకవర్ధిని కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖాశర్మ పర్యవేక్షణలో ‘అంతిమ్ దో దశక్ కే హిందీ కహనియో మే సమాజ్ వాదీ యదార్థవాద్’ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావును ఓయూ హిందీ విభాగాధిపతి డాక్టర్ మాయాదేవి, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ సంగీత, దుమ్ముగూడెం ఎంఈఓ సున్నం సమ్మయ్య, హెచ్ఎం కె.విజయకాంతారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్చరీలో ఉచిత శిక్షణ

కొత్తగూడెంటౌన్: ఆర్చరీ (విలువిద్య)లో బాలబాలికలు, యువతీయువకులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం డీవైఎస్ఓ టి.సీతారాం తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్), కలెక్టర్ సహకారంతో జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్ ఆఫ్ ఆర్చరీ (విలువిద్య)లో శిక్షణ కేంద్రం మంజూరైందని పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని పాల్వంచలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అన్ని వయసుల వారు శిక్షణ కోసం ఈ నెల 17లోపు నేరుగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

త్రైమాసికంలో ఉత్పత్తి ఓకే..

- సింగరేణివ్యాప్తంగా మూడు నెలల్లో 102 శాతం బొగ్గు ఉత్పత్తి
- అగ్రస్థానంలో నిలిచిన కొత్తగూడెం రీజియన్
- జూన్‌లో ఏడు ఏరియాల్లో వంద శాతానికి పైగా..



కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ ముఖచిత్రం

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ఏప్రిల్‌లో వెనుకబడినా మే, జూన్‌లలో పుంజుకుంది. ఫలితంగా తొలి త్రైమాసికంలో 102 శాతం ఉత్పత్తి నమోదైంది. ఇక జూన్‌లో 106 శాతం ఉత్పత్తి సాధించింది. తొలి త్రైమాసికంలో కొత్తగూడెం రీజియన్‌లోని మణుగూరు ఏరియా 122, ఇల్లెందు ఏరియా 129, కొత్తగూడెం ఏరియా 115 ఉత్పత్తి సాధించగా.. కొంతకాలంగా వెనుకంజలో ఉన్న బెల్లంపల్లి ఏరియా జూన్‌లో 128 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే, త్రైమాసిక ఉత్పత్తిలోనూ 116 శాతంతో సింగరేణి వ్యాప్తంగా మూడో స్థానంలో నిలవడం విశేషం.

జూన్‌లో ఏడు ఏరియాల్లో..

ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే లక్ష్య సాధనపై సీఎండీ సహా డైరెక్టర్లు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినప్పటికీ కొన్ని ఏరియాల్లోనే 100 శాతం ఉత్పత్తి నమోదవుతోంది. జూన్‌లో పరిశీలిస్తే బెల్లంపల్లి ఏరియా 128 శాతంతో సింగరేణివ్యాప్తంగా అగ్రస్థానంలో నిలవగా, కొత్తగూడెం ఏరియాలో 119, మణుగూరు ఏరియా 118 శాతం ఉత్పత్తి నమోదు చేసింది. అలాగే, ఆర్జీ–3 ఏరియా 117 శాతం, ఇల్లెందు ఏరియా 114 శాతం, ఆర్జీ–1 ఏరియా 107 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 105 శాతం సాధించగా, మందమర్రి, ఆర్జీ–2, అడ్రియాల, భూపాలపల్లి ఏరియాలు మాత్రం వెనుకబడ్డాయి.


రోజువారీ.. నెల వారీ లక్ష్యాలు ఇలా..

సింగరేణివ్యాప్తంగా ఉన్న 24 భూగర్భగనుల్లో రోజుకు 26,477 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 17,848 వేల టన్నుల ఉత్పత్తి (67 శాతం) సాధించాయి. ఇక 18 ఓసీల్లో రోజుకు 1,79,753 టన్నుల ఉత్పత్తికి గాను 1,73,647 టన్నుల ఉత్పత్తి (97 శాతం) నమోదైంది. అయితే, జూన్‌లో భూగర్భ గనుల్లో 71 శాతం, ఓసీల్లో 106 శాతం ఉత్పత్తి సాధించారు. ఈ నెలలో భూగర్భ గనులకు సంబంధించి ఆర్జీ–2 ఏరియా 1,10,832 టన్నుల ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలవగా.. ఓసీల్లో ఇల్లెందు ఏరియా 129 శాతంతో మొదటి స్థానం దక్కించుకుంది. అయితే, భూగర్భ గనులు, ఓసీల్లో కలిపితే మణుగూరు ఏరియాలో 35,62,434 టన్నుల ఉత్పత్తి నమోదైంది.

గడచిన త్రైమాసికంలో ఏరియాల వారీగా ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	7,35,000	9,51,453	129
మణుగూరు	29,46,596	35,85,076	122
బెల్లంపల్లి	8,40,000	9,73,597	116
కొత్తగూడెం	29,77,481	34,24,468	115
ఆర్జీ–3	12,45,769	12,55,267	101
ఆర్జీ–2	22,55,361	22,08,064	98
ఆర్జీ–1	10,84,977	10,34,576	95
మందమర్రి	11,00,731	9,89,908	90
శ్రీరాంపూర్	17,31,366	14,55,181	84
భూపాలపల్లి	11,03,039	8,02,555	73
అడ్రియాల	4,28,796	2,19,619	51
మొత్తం	1,65,45,270	1,68,99,754	102

అంతటా వంద శాతం ఉత్పత్తికి కృషి



సింగరేణివ్యాప్తంగా చూస్తే 100 శాతం ఉత్పత్తి నమోదవుతున్నా కొన్ని ఏరియాలు వెనుకబడుతున్నాయి. ఆయా ఏరియాల్లో వంద శాతం ఉత్పత్తి సాధించేలా కృషి చేయాలి. ఈ విషయంలో సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. అంతే తప్ప ఉత్పత్తిలో వెనుకబడితే సహించేది లేదు.

–ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

శాంతిభద్రతలు, పరిపాలనపై పోలీసు అధికారుల భేటీ



ఎస్పీలు వినీత్, శరత్‌తో చర్చిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల పరిరక్షణ, శాఖాపరమైన పరిపాలన అంశాలపై మూడు జిల్లాల పోలీసు అధికారులు భేటీ అయ్యారు. సరిహద్దు పంచుకుంటున్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల అధికారులు మంగళవారం ఖమ్మంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ ఎస్పీలు డాక్టర్ వినీత్, శరత్ చంద్రపవార్‌తో పాటు జిల్లాల అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిపాలన, నేరాల నియంత్రణలో సంయుక్తంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఏసీపీ ప్రసన్నకుమార్, పలువురు ఉద్యోగులు హాజరయ్యారు.

అరుదైన సమస్య.. ఆదుకుంటేనే చికిత్స

- చిన్నారికి ఉచిత శస్త్రచికిత్స చేస్తామన్న నిలోఫర్ వైద్యులు
- ఇతర ఖర్చులకు నగదు లేక తల్లిదండ్రుల దైన్యం

దీనగాథ



కుమారుడితో నాగకృష్ణ – ఉమ దంపతులు

ఖమ్మంరూరల్: ఆ చిన్నారికి పుట్టుకతోనే అరుదైన సమస్య వచ్చింది. శస్త్రచికిత్స చేయాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుందని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు తేల్చారు. చివరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో సంప్రదించగా.. ఉచితంగా శస్త్రచికిత్సకు ముందుకొచ్చారు. కానీ నెలల తరబడి హైదరాబాద్‌లో ఉండాల్సి రావడం, మందులతో పాటు ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బు లేక ఆ చిన్నారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దాతలు చేయూతనిస్తే బాబు ఆరోగ్యంగా తమ చెంతకు చేరుతాడని చెబుతున్నారు.

ఏమిటీ సమస్య..

ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాకు చెందిన నాగకృష్ణ – ఉమ దంపతులకు ఏడాదిన్నర కుమారుడు సమ్యుయెల్‌కింగ్ ఉన్నాడు. బాబుకు పుట్టుకతోనే హైపోస్పెడియా అనే సమస్య వచ్చింది. ఈ సమస్యలో భాగంగా బాబు అంగానికి రంధ్రం పూడిపోయి కింద తోలు వద్ద సన్నటి మరో రంధ్రం వచ్చింది. దీంతో మూత్రం సరిగా పోయలేకపోగా, తరచూ జ్వరంతో బాధపడుతుంటాడు. తల్లిదండ్రులు ఖమ్మంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లగా.. ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని అందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని తేల్చిచెప్పారు. కానీ రూ.వేలల్లోనే భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబ సభ్యులు.. ఓ మిత్రుడి సూచన మేరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. అయితే బాబుకు తగిన మొత్తంలో రక్తం లేకపోవడంతో ఒకటి, రెండు నెలల సమయం తీసుకోవాల్సి ఉంటుందని, అప్పటి వరకు క్రమపద్ధతిలో చికిత్స తీసుకోవాలని సూచించారు. కాగా, హైదరాబాద్‌కు నిత్యం ప్రయాణాలు, ఆపరేషన్ సమయంలో అక్కడ ఉండాల్సి రావడం, ఇతర ఆస్పత్రి ఖర్చులకు కూడా చిల్లిగవ్వ లేకపోవడంతో నాగకృష్ణ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

సాయం అందించాలని వేడుకుంటున్నాం..

నేను ఓ ప్రైవేట్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాను. నెలకు రూ.10 వేల జీతం వస్తుంది. అవి ఇంటి రెంటు, ఇంటి అవసరాలకే సరిపోని పరిస్థితి. కాస్తో కూస్తో దాచుకున్న మొత్తం ఇప్పటి వరకు బాబుకు ఆస్పత్రుల్లో పరీక్ష చేయించడానికే సరిపోయింది. ఇప్పుడు ఆపరేషన్ ఉచితంగా చేస్తామని వైద్యులు భరోసా ఇచ్చినా ఇతర ఖర్చులకు చిల్లిగవ్వ కూడా లేదు. దాతలు మాకు చేయూతనివ్వాలని కోరుతున్నాం.

– నాగకృష్ణ, బాబు తండ్రి

సాయం చేయాలనుకునే వారు...

98856 03823 (ఫోన్‌పే, గూగుల్ పే)
అకౌంట్ నంబర్ 31961112804,
ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, ఖమ్మం,
ఐఎఫ్ఎస్‌సీ – ఎస్‌బీఐఎన్0005817

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మంసహకారనగర్: ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న జీపీఎఫ్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్, ఫైనల్ పేమెంట్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే సంబంధిత ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే, ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వి.మనోహర్‌రాజు, ఎస్.విజయ్, ప్రసాద్‌రావు, వై.పద్మ, కె.వెంకటేశ్వర్లు, వెంగళరావు పాల్గొన్నారు.